
టీడీపీ కుటిల రాజకీయం

సీపీ బ్రౌన్ గ్రంథాలయం అదనపు కట్టడాల నిర్మాణాల విషయంలో తెలుగుదేశం పార్టీ నాయకులు అనవసర రాద్ధాంతం చేస్తున్నారు. భవన నిర్మాణ కార్మికులకు కాంట్రాక్టర్ సౌకర్యాలు కల్పించడంలో విఫలం అయినా.. కార్మికులు స్నానాలు, కాలకృత్యాలు తీర్చుకుంటూ స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నా అవేమీ టీడీపీ నేతలు పట్టించుకోవడం లేదు. ఇదేమని ప్రశ్నించినందుకు వైఎస్‌ఆర్‌సీపీ డివిజన్ ఇన్‌ఛార్జ్‌పై పోలీసులచేత అక్రమంగా కేసు బనాయించారు. సీపీ బ్రౌన్ గ్రంథాలయ అభివృద్ధికి రూ. 6.66 కోట్ల నిధులను వైఎస్ జగన్ సర్కార్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. వైఎస్‌ఆర్‌సీపీ అభివృద్ధికి పాటుపడుతుంటే జీర్ణించుకోలేని కడప టీడీపీ నేతలు కుటిల రాజకీయం చేస్తున్నారు.



కడపలోని సీపీ బ్రౌన్ గ్రంథాలయం భవనం



గ్రంథాలయం వెనుక భవననిర్మాణ కార్మికుల కోసం నిర్మించిన షెడ్డు, ఫిల్లర్లు

సాక్షి టాస్క్‌ఫోర్స్: కడప నగరంలోని సీపీ బ్రౌన్ గ్రంథాలయానికి జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంది. ఈ గ్రంథాలయం అభివృద్ధికి గత వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు చేశారు. ప్రస్తుతం అదనపు భవనాల నిర్మాణం సాగుతోంది. ఈ విషయంలో తెలుగుదేశం పార్టీ నాయకులు అనవసర రాద్ధాంతం చేస్తున్నారు. కడప టీడీపీ నేతలు నగరంలోని 21 డివిజన్ వైఎస్‌ఆర్‌సీపీ ఇన్‌ఛార్జ్‌పై అక్రమంగా కేసును బనాయించి తమ అధికార బలాన్ని చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు.

రూ. 6.66 కోట్ల నిధులు మంజూరు..

సీపీ బ్రౌన్ గ్రంథాలయం విస్తరణ చేయాలని దివంగత జానమద్ది హనుమచ్ఛాస్త్రి కుమారుడు, గ్రంథాలయ సలహామండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్‌తో పాటు, అనేకమంది నాయకులు, అధికారులు, వైవీయూ అధికారులు వైఎస్ జగన్ సీఎంగా ఉండగా విన్నవించారు. ఆయన గ్రంథాలయ అభివృద్ధికి అదనపు భవనాల నిర్మాణానికి రూ. 6.66 కోట్లు నిధులను మంజూరు చేశారు. సీపీ బ్రౌన్ గ్రంథాలయం ప్రాంతం విస్తరింపచేసేందుకు వెనుక భాగాన 0.27 సెంట్లు స్థలాన్ని రూ. 3 కోట్లతో సేకరణ చేశారు. భవన నిర్మాణాల అభివృద్ధి కోసం మరో రూ.3.66 నిధులను మంజూరు చేశారు. ఇందుకోసం వైఎస్ జగన్ తాను సీఎంగా వున్న సమయంలో సీపీ బ్రౌన్ గ్రంథాలయంను పరిశీలించి, ఈ నిర్మాణ పనులకు శ శంకుస్థాపన చేశారు. ఈ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఆ శిలాఫలకాన్ని దాచేశారు. ఈ విషయాన్ని స్థానికంగా 21వ డివిజన్‌కు సంబంధించిన వైఎస్‌ఆర్‌సీపీ ఇన్‌ఛార్జ్ మోతుకూరు సుబ్బరాయుడు టీడీపీ నేతల పర్యటన సమయంలో ప్రశ్నించారు. దీంతో అతనిపై అక్కసును పెంచుకున్న టీడీపీ నేతలు సమయం కోసం ఎదురుచూశారు. కాగా ప్రస్తుతం స్థానికంగా సీపీ బ్రౌన్ గ్రంథాలయం వద్ద భవన నిర్మాణ పనులను కాంట్రాక్టర్ మోహన్‌రెడ్డి చేయిస్తున్నారు. ఆయన ఈ భవన నిర్మాణ పనులను వేగవంతంగా చేసేందుకు నిర్మాణాల సమీపంలో షెడ్డును కార్మికుల కోసం ఏర్పాటు చేయించారు. దాదాపు 30 మంది కార్మికులు, తమ పిల్లలు, ఆడవాళ్లతో సహా అక్కడే నివాసం వుంటున్నారు. అంతేగాక స్థానిక బహిరంగ ప్రదేశాల్లోనే కాలకృత్యాలను తీర్చుకోవడం, స్నానాలను చేయడం వలన తీవ్రస్థాయిలో అపరిశుభ్రత నెలకొంది. భవన నిర్మాణ కార్మికులకు ఎలాంటి వసతులను కాంట్రాక్టర్ మోహన్‌రెడ్డి కల్పించకపోవడం వలనే ఈ విధంగా కార్మికులు వ్యవహరిస్తున్నారని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు స్థానిక కార్పొరేటర్ మోతుకూరు సుజాత, ప్రజలతో కలిసి వినతిపత్రం కూడా అందచేశారు. ఈ వ్యవహారంను పక్కదోవ పట్టించేలా కాంట్రాక్టర్ మోహన్‌రెడ్డి చేత రెండు రోజుల క్రితం టీడీపీ నేతలు 21వ డివిజన్ ఇన్‌ఛార్జ్ మోతుకూరు సుబ్బరాయుడు తమను రూ. 6 లక్షలను డిమాండ్ చేశారనీ, ఆ డబ్బులను ఇవ్వనందుకు స్థానిక ప్రజలను రెచ్చగొట్టి అనవసరమైన ఆరోపణలను చేయించి కడప ఒన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయించారు. పోలీసులు కూడా టీడీపీ నేతల సూచనల మేరకు సుబ్బరాయుడుపై అక్రమంగా కేసును ఆగమేఘాలమీద బనాయించేశారు.





బహిరంగంగా స్నానాలను చేస్తూ నీళ్లను ఉపయోగించుకుంటున్న భవననిర్మాణ కార్మికులు (ఫైల్)

ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు



సీపీ బ్రౌన్ గ్రంథాలయం విస్తరణలో భాగంగా భవన నిర్మాణాలను చేపట్టడం ప్రజలందరికీ ఆమోదయోగ్యమే. భవన నిర్మాణాల కోసం వచ్చిన కార్మికులకు షెడ్డును మాత్రమే వేసి ఎలాంటి సౌకర్యాలను కార్మికులకు కాంట్రాక్టర్ కల్పించలేదు. వారు కాలకృత్యాలను, స్నానాలను బహిరంగంగా చేయడం వలన పిల్లలు, మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజల అభిప్రాయం మేరకు కార్పోరేషన్ అధికారులకు వినతిపత్రం సమర్పించాం.

– మోతుకూరు సుజాత, 21వ డివిజన్ కార్పోరేటర్, కడప

అక్రమ కేసును బనాయించారు... న్యాయపోరాటం చేస్తాం



కాంట్రాక్టర్ బాధ్యతారాహిత్య చర్యలను ప్రశ్నించినందుకు నాపై అక్రమ కేసును కడప ఒన్‌టౌన్‌లో పోలీసుల చేత, టీడీపీ నేతలు బనాయించారు. ఈ అంశాన్ని ఇప్పటికే జిల్లా ప్రధాన న్యాయమూర్తికి, జిల్లా ఎస్పీకి, డీఎస్పీకి, కడప ఒన్‌టౌన్ పోలీసులకు వినతి పత్రం సమర్పించి సమస్యను వారి దృష్టికి తీసుకుని వెళ్లాం. న్యాయపోరాటం చేస్తాం. సీపీ బ్రౌన్ గ్రంథాలయం వద్ద భవన నిర్మాణ కార్మికులకు సరైన సౌకర్యం కల్పించని కాంట్రాక్టర్ బాధ్యతా రాహిత్యం వలన కార్మికులు బహిరంగంగానే కాలకృత్యాలు, స్నానాలను చేస్తున్నారనీ కార్పోరేషన్ అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లాం. వారు వచ్చి అపరిశుభ్రతపై ప్రశ్నించారు.

– మోతుకూరు సుబ్బరాయుడు, 21వ డివిజన్ వైఎస్‌ఆర్‌సీపీ ఇన్‌ఛార్జ్

క్లుప్తంగా

నేడు రుద్రాభిషేకం

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరం గడ్డిబజారులోని శ్రీ కామకోటి కళాంబదేవి, శ్రీ సోమసుందరేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు భక్త బృందం ఒక ప్రకటనలో తెలిపింది. సాయంత్రం 5.30 గంటలకు బహుళ త్రయోదశి ప్రదోష సమయంలో శివునికి, నందీశ్వరునికి ఏకకాలంలో రుద్రాభిషేకాన్ని నిర్వహిస్తున్నామన్నారు. తొలుత గణపతిపూజ, ఏకకాలంలో రుద్రాభిషేకం, విశేష అలంకారం, ఉత్సవ మూర్తుల ఆలయ ప్రదక్షిణ, వ్రత కథ, మహా మంగళ హారతి, మంత్రపుష్పం, వేద ఆశీర్వచనం, తీర్థ ప్రసాద వినియోగం కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

నేటి నుంచి ఉచిత వైద్య శిబిరాలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని జగదీష్ న్యూరో కేర్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఈనెల 19, 20, 21 తేదీలలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని ఆస్పత్రి వైద్య నిపుణులు డాక్టర్ క్రాంతిరెడ్డి తెలిపారు. ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు ఈ శిబిరాలు ఉంటాయన్నారు. ఉచితంగా షుగర్ పరీక్ష నిర్వహిస్తారన్నారు. రూ. 5 వేల విలువజేసే సిటీ స్కానింగ్ రూ. 2500కే చేస్తారన్నారు. ఇతర పరీక్షలపై 50 శాతం తగ్గింపు ఇస్తామని, రోగులు అపాయ్‌మెంట్ కోసం 91546 10804, 95059 07803 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న శ్రీసాయి యువజన సేవా సంఘం ఛైర్మెన్ చంద్రశేఖర్ రెడ్డి

కడప కార్పొరేషన్: మాజీ మంత్రి ఆర్. రాజగోపాల్‌రెడ్డి 12వ వర్ధంతి సందర్భంగా కడప నగరం జిల్లా పరిషత్ ఆవరణంలో ఉన్న ప్రేమాలయ నిరాశ్రయుల వసతి గృహంలో శ్రీసాయి యువజన సేవా సంఘం ఛైర్మెన్ మలిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ 9వ డివిజన్ ఇన్‌చార్జి బి. పవన్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఎం వి క్రిష్ణారెడ్డి. భాస్కర్‌రెడ్డి, గంగాధర్, ప్రసాద్ నాయుడు, శివశంకర్, వసతి గృహ నిర్వాహకులు శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

ఘన సన్మానం



కేజీబీవీలలో పనిచేస్తూ డీఎస్సీలో మెరిట్ సాధించినవారిని సన్మానిస్తున్న ఏపీసీ

కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని కేజీబీవీలలో పనిచేస్తూ డీఎస్సీ పరీక్ష రాసి ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఎన్నికైన ఉపాధ్యాయులను కడపలోని సమగ్ర శిక్ష ఆఫీసులో గురువారం ఏపీసీ నిత్యానందరాజులు, జీసీడీఓ దార్ల రూత్ ఆరోగ్య మేరి సన్మానించారు. ఒక వైపు కేజీబీవీలో టీచర్ గా కొనసాగుతూ మరో వైపు కుటుంబాన్ని చూసుకుంటూ డీఎస్సీలో మెరిట్ సాధించడం గొప్ప విషయమన్నారు. చాపాడు నుండి ప్రసన్నలక్ష్మి, కోడూరు నుండి మమోల, పెద్దముడియం నుండి మేరమ్మ, ఓబులమ్మ, గంగా శిరీష, మైదుకూరు నుండి హరిత, జమ్మలమడుగు నుండి కళావతి , గీత, వేముల నుండి నాగమల్లేశ్వరమ్మ, వల్లూరు నుండి పున్నమ్మ డీఎస్సీ లో మెరిట్ సాధించారు.

అంత్యక్రియలు



మృతురాలికి నివాళులర్పిస్తున్న బాలసుబ్బయ్య తదితరులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : నగర శివార్లలోని ఆజాద్‌నగర్‌లో ఉన్న బృంద వృద్ధాశ్రమంలో గత నాలుగు సంవత్సరాల నుంచి ఫాతిమా అనే వృద్ధురాలు ఉంటోంది. ఆమెకు ఎవరూ లేక ఆశ్రమంలో ఉంటున్నదని, గురువారం అనారోగ్యంతో మృతి చెందిందన్నారు. ఈ విషయాన్ని వృద్ధాశ్రమం నిర్వాహకులు బాలసుబ్బయ్య, సుధారాణిలు మేము సైతం సేవా సంస్థకు తెలియజేయడంతో వారు వచ్చి మృతురాలికి అంత్యక్రియలు నిర్వహించారు.

బీమా సమస్యలను పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రంలోని ఉపాధ్యాయుల ప్రభుత్వ సామూహిక జీవిత బీమా సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యామసుందర్ రెడ్డి కోరారు. ఈ విషయమై గురువారం జీవిత బీమా సహాయ సంచాలకులు రమేష్‌ను కలెక్టరేట్ లోని జీవిత బీమా కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఖాదర్ బాషా , జిల్లా కార్యదర్శులు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల వేతనంలో కోతకోస్తున్న ఏజెన్సీని బ్లాక్ లిస్టులో పెట్టాలి



కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లాలో ఉన్న ప్రభుత్వ హాస్పిటల్ లో పనిచేస్తున్న సెక్యూరిటీ ,శానిటేషన్ కార్మికుల వేతనాలలో కోత కోస్తున్న ఏజెన్సీని, శానిటేషన్ నిర్వహిస్తున్న యాజమాన్యం పైన చర్యలు తీసుకోవాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డికి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, మున్సిపల్ యూనియన్ జిల్లా కోశాధికారి ఎస్ గోపి లు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ముఖ్యంగా జమ్మలమడుగు ,ప్రొద్దుటూరు, మైదుకూరు ,బద్వేలు, కడప, పులివెందుల, పోరుమామిళ్ల, కమలాపురంలలో సెక్యూరిటీ, శానిటేషన్ కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. జీవో నెంబర్ 549 ప్రకారం రూ.16వేలు ఇవ్వాల్సి ఉండగా రూ.10 వేల నుంచి రూ.12 వేలు మించి ఎవరికి ఇచ్చేవారు కాదన్నారు. ఇటీవల కొత్త అగ్రిమెంట్ ప్రకారం రూ.18600 ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.11200 నుంచి రూ. 12 వేలకు మించి ఎవరికీ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ నిర్వాహకులు కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని తెలిపారు.

రాజ్యాంగం ప్రజలకు వెన్నుదన్ను



మాట్లాడుతున్న పుత్తా పద్మ

కడప ఎడ్యుకేషన్: భారత రాజ్యాంగం దేశంలోని ప్రజలందరికీ వెన్నుదన్నుగా నిలుస్తోందని యోగి వేమన విశ్వవిద్యాలయం కుల సచివులు ప్రొఫెసర్ పి పద్మ పేర్కొన్నారు. భారత ప్రభుత్వ కమీషన్ ఫర్ సైంటిఫిక్ అండ్ టెక్నికల్ టెర్మినాలజీ(సి.ఎస్.టి.టీ) విద్యా మంత్రిత్వ శాఖ, ఉన్నత విద్యా శాఖ, న్యూఢిల్లీ ,వైవీయూ అకడమిక్ అఫైర్స్ ఆధ్వర్యంలో x75 సంవత్సరాల భారత రాజ్యాంగం సాంకేతిక పదజాలంపై 2 రోజుల జాతీయ సదస్సు × ప్రారంభ సభ గురువారం వైవీయూలోని అన్నమాచార్య సెనేట్ హాల్లో నిర్వహించారు. వైవీయు రాజకీయ శాస్త్రం ప్రజా పరిపాలన విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ , నేషనల్ సెమినార్ లోకల్ కోఆర్డినేటర్ డాక్టర్ డి. రవీంద్ర సతీష్ బాబు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి గా హాజరైన రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ మాట్లాడుతూ ప్రతి పౌరుడికి రక్షణ కల్పించే రాజ్యాంగాన్ని వారికి అర్థమైన భాషలో చదువుకునేంత సరళమైన విధానం లోకి తీసుకొస్తున్న సిసిటిటిని అభినందించారు. భారత రాజ్యాంగం పౌరులందరికీ వెన్నెముక లాంటిదని స్పష్టం చేశారు. విశిష్ట అతిథి యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి శ్రీనివాస్, ముఖ్య వక్త న్యూఢిల్లీ జామియా మిలియా ఇస్లామియా రాజకీయ శాస్త్ర విభాగం, ఫ్లోరిడా సోషల్ సైన్సెస్ ప్రొఫెసర్ నవేద్ జమాల్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం



విద్యుత్ భవన్ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యుత్ ఉద్యోగుల జేఏసీ నాయకులు

కడప కార్పొరేషన్: విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం ఆగదని జిల్లా విద్యుత్ జేఏసీ చైర్మన్ యూఎస్‌కే బర్నబాస్ స్పష్టం చేశారు. గురువారం కడప విద్యుత్ భవన్ వద్ద రెండవ రోజు భోజన విరామ సమయంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో విద్యుత్ భవన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బార్నబాస్ మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో విద్యుత్ సంస్థల యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తోందన్నారు. డిస్ట్రిబ్యూషన్ కంపెనీల యాజమాన్యం కార్మిక చట్టాలకు విద్యుత్ బోర్డ్ విభజనకు ముందు ఉద్యోగ సంఘాలతో కుదుర్చుకున్న త్రైపాక్షిక ఒప్పందానికి విరుద్ధంగా వ్యవహరించడం తగదన్నారు. విద్యుత్ ఉద్యోగులకు, పెన్షనర్లకు, వారి కుటుంబ సభ్యులకు పూర్తి వైద్య ఖర్చులు చెల్లించాలని, రాష్ట్ర ప్రభుత్వంలో అమలులో ఉన్న జీపీఎఫ్‌తో కూడిన పెన్షన్ నిబంధనలను 1999 ఫిబ్రవరి 1 నుండి 2004 ఆగస్టు 31వరకు నియమింపబడిన ఉద్యోగులందరికీ వర్తింపజేయాలన్నారు. ఎన్నో సంవత్సరాల నుండి పనిచేస్తున్న కాంట్రాక్ట్ లేబర్, అవుట్ సోర్స్ ఉద్యోగులకు యాజమాన్యమే నేరుగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ ఎం. వి. చలపతి , స్టేట్ వైస్ ప్రెసిడెంట్ బి. రామలింగారెడ్డి, జిల్లా జేఏసీ నాయకులు ఫయాజ్ బేగ్, మురళీమోహన్, ఎం యాకోబ్, రామక్రిష్ణ, బ్రహ్మానంద రెడ్డి లక్ష్మీనారాయణ , సుధాకర్, కేశవరెడ్డి పాల్గొన్నారు.

కోవిడ్ -19కు ముందు ఆగుతున్న రైళ్లను పునరుద్ధరించాలి



రైల్వేస్టేషన్ మేనేజర్ వెంకట సుబ్బయ్యకు వినతిపత్రం సమర్పిస్తున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కోవిడ్-19కు ముందు వైఎస్సార్ జిల్లాలో ఆగుతున్న రైళ్లను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షులు సంబటూరు ప్రసాద్ రెడ్డి కోరారు. గురువారం కడప రైల్వేస్టేషన్ ఇన్‌ఛార్జి మేనేజర్ వెంకటసుబ్బయ్యకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప రైల్వేస్టేషన్‌లో 22705/706 తిరుపతి-జమ్ము, జమ్ము-తిరుపతి హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్‌ను కడపలో ఆపాలని కోరారు.

– కమలాపురం రైల్వేస్టేషన్‌లో 12793/94 తిరుపతి-నిజామాబాద్, నిజామాబాద్-తిరుపతి రాయలసీమ ఎక్స్‌ప్రెస్, 17415/16 తిరుపతి-కొల్హాపూర్, కొల్హాపూర్-తిరుపతి హరిప్రియ ఎక్స్‌ప్రెస్, 22157/58 ముంబయి-చెన్నై, చెన్నై- ముంబయి మెయిల్ ఎక్స్‌ప్రెస్, 07521/22 కడప-గుంతకల్లు, గుంతకల్లు-కడప తిరుమల ఎక్స్‌ప్రెస్‌ను ఆపాలని కోరామన్నారు.

– ముద్దనూరు రైల్వేస్టేషన్‌లో 22159/60 చెన్నై-ముంబయి, ముంబయి-చెన్నై ఎక్స్‌ప్రెస్, 17215/16 ధర్మవరం-మచిలీపట్నం, మచిలీపట్నం-ధర్మవరం, 17415/16 తిరుపతి-కొల్హాపూర్, కొల్హాపూర్-తిరుపతి ఎక్‌ప్రెస్, 17419/20 తిరుపతి-వాస్కోడిగామా, వాస్కోడిమా-తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని కోరామన్నారు.

– కొండాపురంలో 12797/98 చిత్తూరు-కాచిగూడ, కాచిగూడ-చిత్తూరు వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్, 12793/94 తిరుపతి-నిజామాబాద్, నిజామాబాద్-తిరుపతి రాయలసీమ ఎక్స్‌ప్రెస్, 17651/52 చెంగల్పట్టు-కాచిగూడ, కాచిగూడ-చెంగల్పట్టు ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని కోరామన్నారు. ఇప్పటికే కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి కేంద్ర రైల్వే శాఖ మంత్రికి, రైల్వేబోర్డు ఛైర్మన్‌కు, దక్షిణ మధ్య రైల్వే జీఎంకు, విజయవాడ రైల్వే భవన్ మీటింగ్‌లో పలుమార్లు విన్నవించారన్నారు.

– ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ ఛైర్మన్ బాలయ్య యాదవ్, చెన్నూరు ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, కమలాపురం విద్యార్థి విభాగం అధ్యక్షులు మైసూరారెడ్డి, సర్పంచులు నారాయణరెడి, సాయిపవన్‌కుమార్, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలి



కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాష

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులు ఆర్థికపరమైన డిమాండ్ల సాధనకు ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలని జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ బాష పిలుపునిచ్చారు. గురువారం కడప రీజినల్ కన్వీనర్ అబ్దుల్ వాజిద్ అధ్యక్షతన కడప రీజియన్ సమావేశం ఎస్టీయూ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులను ఆర్థికపరమైన అంశాల హామీ అమలు విషయంలో వంచనకు గురి చేయవద్దని ఇచ్చిన ఎన్నికల హామీలను తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఎంప్లాయ్ వెల్ఫేర్ స్కీమ్స్ అమలు చేయలేదని, 12వ పీఆర్సీ అమలు ఇప్పటికే రెండు సంవత్సరాలు ఆలస్యం జరిగిందన్నారు. మధ్యంతర భృతి ప్రకటననే చేయలేదని, ఇప్పటికి నాలుగు డీఏలు ఉద్యోగులకు ఈ ప్రభుత్వం బకాయి ఉందని అన్నారు. అక్టోబర్ నెలలో ఉద్యోగ ఉపాధ్యాయుల ఆర్థిక ప్రయోజనాల సాధనకు రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఉద్యమ కార్యాచరణ కు దిగుతామని, అందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యవర్గ సమావేశంలో నాయకులు రాష్ట్ర మున్సిపల్ కన్వీనర్ రవిశంకర్ రెడ్డి, పూర్వ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నకేశవరెడ్డి, జిల్లా ముఖ్య నాయకులు బాబు పద్మాకర్, మహబూబ్ బాషా, జిల్లా నాయకులు రాజేంద్ర, జయరామ్, వెంకటసుబ్బయ్య, ఫక్రుద్దీన్, రాజగోపాల్‌రెడ్డి, నగర ప్రధాన కార్యదర్శి, సంజీవ రాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పోరాట యోధుడు సురవరం



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి. ఈశ్వరయ్య

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఆర్థిక, రాజకీయ, సాంఘిక సమానత్వం కోసం ప్రజా సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని పోరాటం చేసిన ప్రజా పోరాటాల యోధుడు సురవరం సుధాకర్ రెడ్డి అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి ఈశ్వరయ్య, కాంగ్రెస్ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ తులసి రెడ్డి కొనియాడారు. గురువారం సీపీఐ ఆధ్వర్యంలో వైఎస్‌ఆర్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై దేశవ్యాప్తంగా కమ్యూనిస్టు ఉద్యమాన్ని తన నాయకత్వ పటిమతో ముందుకు తీసుకుపోయారన్నారు. కమ్యూనిస్టు పార్టీల ఐక్యత, విలీనంపై కట్టుబడి ఉన్నారన్నారు. ఆయన మరణానంతరం కూడా ఆయన శరీరాన్ని గాంధీ వైద్య కళాశాలకు వైద్య విద్యార్థుల ప్రయోగాల కోసం దానం చేసిన గొప్ప వ్యక్తి సురవరం సుధాకర్ రెడ్డి కొనియాడారు. ఈ సంస్మరణ సభలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, సీపీఎం జి చంద్రశేఖర్, జనసేన పత్తి విశ్వనాథ్, ఆమ్ ఆద్మీ పార్టీ పార్టీ డాక్టర్ శ్రీనివాసులు, జన విజ్ఞాన వేదిక విశ్వనాథ్, జి గోపాల్, లోక్‌సత్తా కృష్ణ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రామయ్య, నాగసుబ్బారెడ్డి, సుబ్బారెడ్డి , వీరశేఖర్, వెంకటశివ, చంద్రశేఖర్, వేణుగోపాల్, సుబ్రమణ్యం, విజయలక్ష్మి, కేసి బాదుల్లా, గంగాసురేష్ తదితరులు పాల్గొన్నారు.

దేవునికడపలో నవరాత్రి ఉత్సవాలు

కడప సెవెన్‌రోడ్స్ : దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 22 నుంచి అక్టోబరు 2వ తేది వరకు నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నామని తిరుమల-తిరుపతి దేవస్థాన అధికారులు తెలిపారు. ప్రతిరోజు ఉదయం 11.00 నుంచి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరి నీళ్లు, పండ్ల రసాలతో విశేష అభిషేకాలు నిర్వహిస్తారు. అలాగే ప్రతిరోజు సాయంత్రం 7 గంటలకు వాహన సేవలు ప్రారంభమవుతాయి. ఈనెల 28వ తేది సాయంత్రం 5.00 గంటలకు స్వామి, అమ్మవార్లు గరుడ వాహనంపై భక్తులను ఆశీర్వదించనున్నారని తెలిపారు.

వాహన సేవలు

ఈనెల 22వ తేది సాయంత్రం తిరుచ్చి వాహనం, 23న శేష వాహనం, 24న చిన్నప్రభ వాహనం, 25న హనుమంత వాహనం, 26న గరుడ వాహనం (స్వామి, అమ్మవార్లు దేవునికడప నుంచి బయలుదేరి బీకేఎం వీధి, వైవీ స్ట్రీట్, బెల్లం మండివీది, మోచంపేట, బ్రాహ్మణవీధి మీదుగా తిరిగి ఆలయానికి చేరుతారు) .27న ముత్యపు పందిరి వాహనం, 28న గరుడవాహనంపై పాత కడప గ్రామ వీధుల్లో భక్తులకు దర్శనమిస్తారు. 29న తిరుచ్చి వాహనం, 30న సర్వభూపాల వాహనం, అక్టోబరు 1న చిన్నశేష వాహనం, 2న అశ్వవాహనంపై స్వామి, అమ్మవార్లు విహరించి భక్తులను ఆశీర్వదించనున్నారు.

పోటీ పరీక్షపై అవగాహన పెంచుకోవాలి

కడప ఎడ్యుకేషన్: విద్యార్థులు పోటీ పరీక్షలపై అవగాహన పెంచుకోవాలని ప్రిన్సిపాల్ సలీంబాష సూచించారు. కడపలోని ఎస్ కే ఆర్ - ఎస్ కే ఆర్ ప్రభుత్వ మహిళ కళాశాలలో గురువారం కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులకు పోటీ పరీక్షలపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సలీం బాష మాట్లాడుతూ విద్యార్థినిలు డిగ్రీ స్థాయిలోనే ఒక లక్ష్యాన్ని ఎంపిక చేసుకొని ప్రణాళికాబద్ధంగా కృషి చేసినట్లయితే తప్పక విజయం సాధిస్తారన్నారు. కర్నూలు ఎస్.వి.ఆర్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ ఎస్ వెంకట రామిరెడ్డి పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను కళాశాల విద్యార్థులకు , కళాశాల లైబ్రరీకి ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ ఏ. చంద్రబాబు రెడ్డి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

కడప కోటిరెడ్డిసర్కిల్ : పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతులుగా ఉంటారని ఐసీడీఎస్ అర్బన్ సీడీపీఓ వాణి, అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఉమామహేశ్వరకుమార్‌లు తెలిపారు. గురువారం కడప నగరంలోని నకాష్ సెక్టార్‌లో 8వ రాష్ట్రీయ పోషణ్ మాసోత్సవంలో భాగంగా అంగన్వాడీ కేంద్రంలో కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని అక్టోబరు 16 వరకు పోషణ్ మాసోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణీలకు సీమంతాలు నిర్వహించారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ రద్దు చేయకుంటే ఉద్యమం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : రాష్ట్రంలోని మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ రద్దు చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈశ్వరయ్య హెచ్చరించారు. ఈ మేరకు గురువారం నగరంలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబుపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. దేశ ప్రధాని మోదీ మెప్పు పొందేందుకు చంద్రబాబు కుటిల ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. కడప జిల్లాలో ఉల్లి రైతులు గిట్టుబాటు ధర లేకుండా అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో కేంద్రం నుండి 17 మెడికల్ కళాశాలలను మంజూరు చేయిస్తే ఇప్పుడు ఈ ప్రభుత్వం ప్రైవేటీకరణ దిశగా ఆలోచించడం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, నగర కార్యదర్శి నేసే వెంకట శివ పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ సహకార సంవత్సరం

కడప అగ్రికల్చర్: అంతర్జాతీయ సహకార సంవత్సర కార్యక్రమాన్ని గురువారం కడప శ్రీహరి డిగ్రీ కళాశాలలో జిల్లా సహకార కేంద్రబ్యాంకు అధికారులు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డీసీసీ బ్యాంకు సీఈఓ రాజామణి, జిల్లా సహకార అధికారి వెంకటసుబ్బయ్యలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు అంతర్జాతీయ సహకార సంవత్సరం -2025 ప్రధాన ఉద్దేశ్యం కార్పొరేటివ్ బిల్డ్ ఏ బెటర్ వరల్డ్ గురించి వివరించారు. అనంతరం డీసీసీ బ్యాంకు సహకార సంఘాల ద్వారా పట్టణ అభివృద్ధి పునర్నిర్మాణం అనే అంశంపై విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను బ్యాంకు సీఈఓ రాజామణి, జిల్లా సహకార అధికారి వెంకటసుబ్బయ్యలు అందచేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చెన్నకేశవరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన మాసీమబాబు



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాసీమ బాబు తదితరులు

కడప కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని టీటీడీ బోర్డు మాజీ సభ్యులు మాసీమ బాబు, వారి కుమారులు రాహుల్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డిలు కలిశారు. బుధవారం రాత్రి తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో వారు వైఎస్ జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలోని రాజకీయ పరిస్థితులను ఆయనకు వివరించారు.